# కర్మణ్యే వాధికారస్తే

"డాడీ! నాకు హెచ్ వన్ బీ వీసా వచ్చింది. నెక్స్ట్ మంత్ స్టేట్స్‌కెళ్ళిపోతాను"

అమాంతం నా కాళ్ళకింది భూమి కృంగిపోయినట్టూ, నేను అగాథంలోకి కూరుకుపోయినట్టూ అనుభూతి చెందాను. బాధగా చూశాను. వేదన పడుతూ చూశాను. తడిబారిన కళ్లతో వణుకుతూ చూశాను.

అబ్బాయి మరేదీ మాట్లాడాల్సిందిలేనట్టు తన గదిలోకెళ్ళిపోతోంటే శక్తినంతా కూడదీసుకున్నాను.

"ఇక్కడ బాగానే వుంది కదరా. ఏభై వేలు పైచిలుకే వస్తోంది. కోడలు కూడా ఇక్కడే జాబ్ చేస్తోంది. కడుపులో నీళ్ళు కదలకుండా పుట్టి పెరిగిన సిటీలో స్వంత ఇంట్లో వుండక, అవతలి ఒడ్డున పచ్చగా కన్పిస్తోందని గోదావరి ఈదుతానంటావేమిట్రా. గోదావరి ఈత లంకమేత అని ఊరికే అన్లేదు....."

"ట్రాష్! పాత చింతకాయ పచ్చడి కబుర్లు చెబుతారేంటి!". వాడి స్వరంలోని విసుగుకి నివ్వెరబోయాను.

"అదికాదురా ఆనందూ– ఇప్పుడు అమెరికా వెళ్ళాల్సినంత అవసరం ఏమొచ్చింది చెప్పు?"

"ఇక్కడెన్నేళ్లు జాబ్‌చేసినా ఇలాగే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు వుంటాం. అదే అక్కడికెళ్ళేమనుకో చకచకా కరోడ్‌పతి అయిపోవచ్చు" చిటికేస్తూ చెప్పేడు ఆనంద్.

"దూరపుకొండల నునుపుదనం చూసి పరుగెట్టడం మంచిదికాదురా. పరుగెత్తి పాలుతాగేకన్నా నిలబడి నీళ్ళు తాగడం ఉత్తమం. నా మాట విని ఆ ప్రయత్నాలు కట్టిపెట్టు......" నచ్చచెప్పడానికి ప్రయత్నించాను.

"మీ నాన్న చెప్పినట్టు వినరా" అంది నా భార్య గుడ్లనీళ్ళు కుక్కుకుని!

"ఫూలిష్‌గా మాట్లాడతావేంటి డాడీ. అందరి పేరెంట్సూ తమ పిల్లల్ని 'అమెరికా వెళ్ళండి. డాలర్ల పంట కోసుకురండి' అని తరుముతోంటే మీరు వద్దంటారేవిటీ! అయినా ఇలా చివర్లో మానెయ్యడానికా ఆర్నెల్లనుంచీ ప్రయత్నిస్తోందీ!"

వాడలా అనేసరికి విస్తుబోయి ముఖముఖాలు చూసుకున్నాం నేనూ, నా భార్యా.

"ఆర్నెల్లనుంచి ప్రయత్నిస్తున్నావా?"

"లేకపోతే ఇప్పటికిప్పుడు వీసా వచ్చేస్తుందనుకున్నారా? ఎప్పుడో మార్చిలో కన్సల్టెంట్‌కి సెవెంటీ ఫైవ్ థౌజండ్ పే చేశాను తెలుసా? హెచ్‌ఒన్‌బి కోసం అప్లికేషన్లు ఇబ్బడిముబ్బడిగా రావడంతో లాటరీ తీశారు. అందులో సెలక్టయ్యాక చెన్నై వీసా ఇటర్వ్యూకోసం వెళ్ళాను. నాతోపాటు వచ్చిన నా ఫ్రెండ్సెవ్వరికీ వీసా రాలేదు. అకడమిక్ రికార్డు, మైక్రోసాఫ్ట్ సర్టిఫికెట్లు చూసి రెండేరెండు నిమిషాల్లో వీసా ఇచ్చేశారు"

"మరిదంతా మాకు చెప్పలేదేంరా......"

"వచ్చేక చెబుదామనుకున్నాను....."

"ఇదంతా కోడలికి తెలుసట్రా?" నా భార్య ఆరాతీసింది.

తెలుసన్నట్టు తలూపి బయటికెళ్తూ-

"రాత్రి డిన్నర్‌కు రాను. వీసా వచ్చిందని ఫ్రెండ్స్‌కి పార్టీ ఇస్తున్నాను. సత్య అక్కడికి వస్తుంది. ఇద్దరం కలిసి ఇంటికి వస్తాం" అన్నాడు.

మరి రెండు నిమిషాల్లో బైట పల్సర్ ఝామ్మంటూ దూసుకువెళ్ళిపోయిన శబ్దం విన్పించింది.

డీలాపడి కూర్చుండిపోయా.

"విన్నారా విన్నారా..... నిన్నగాక మొన్న వచ్చిన పెళ్ళానికన్నీ తెలుసు. మనకంతా చాటు! ఊరికే అన్నారా పెళ్ళాం బెల్లం, తల్లి అల్లం అని!" బుగ్గలు నొక్కుకుంది.

"ఒక్కగానొక్క కొడుకు. పెళ్ళాం బిడ్డల్తో కళ్ళెదుటే ఉంటాడు, మనల్ని కంటికి రెప్పలా చూసుకుంటాడనుకున్నాను. అలాటిది అర్థాంతరంగా వీడికి అమెరికా పిచ్చి పట్టిందేవిటే!" అన్నాను నా భార్యతో.

"ఇది వీడికి పుట్టినబుద్ధి కాదండీ, కోడలుపిల్ల ఎక్కించిన పైత్యం. ఆవిడగారి బావా, పెత్తల్లి కొడుకూ అమెరికాలో ఉన్నారుగా! అందుకని, ఈవిడ కూడా అక్కడే ఊరేగొచ్చుని రెచ్చగొట్టి వుంటుంది! వెర్రి బాగులోడు దాని మాటలమాయలో పడిపోయ్యాడు. సందేహం లేదు. ఇదంతా వేరుకాపురం పెట్టడానికి వేసిన ఎత్తుగడే. పెళ్ళై ఏడాదికాలేదు హవ్వ! అప్పుడే తల్లీబిడ్డల్ని వేరు చెయ్యడానికి పూనుకుందా మహంకాళి!" కళ్ళొత్తుకుంది.

"నువ్వు ఊరుకోవే. ఇప్పుడేవంత మునుచుకుపోయిందనీ!" ఓదార్పుగా అన్నాను.

"మునగడానికి ఇంకేం మిగిలిందండీ! రేపు రోగం వచ్చినా, రొష్టువచ్చినా పట్టించుకునే నాథుడుండడు. కడకి గుక్కెడు నీళ్ళు గొంతులో పోసే దిక్కుండదు. ఇక తులసినీళ్ళ సంగతి చెప్పొద్దు" అంది.

"అవేం మాటలే. ఊరుకో..." నర్దిచెప్పడానికన్నానుగాని నేనూ సరిపెట్టుకోలేకుండా వున్నాను.

ఆశనిపాతంలా తగిలిందా వార్త.

ఇంతదాకా గంతులేస్తున్నాం. ఇప్పుడు కాళ్ళూ చేతులూ ఆడటం మానేశాయి.

ఎంతలో ఎంత మార్పు!

ఆనంద్‌కి సిటీలోనే ఉద్యోగం వచ్చిందని ఎంతగా మురిసిపోయామో మాటల్లో చెప్పలేం.

సిటీ అమ్మాయితోనే పెళ్లి జరిపించాం. ఆమె కూడా ఇక్కడే ఉద్యోగం చేస్తోందని పొంగిపోని రోజు లేదు.

ఇద్దరూ చిలకా గోరింకల్లా కళ్లెదుట ఉంటున్నారు, వాళ్ళకి పిల్లలు పుట్టేక ఇల్లంతా సందడిగా ఉంటుంది, మాకూ కాలక్షేపమవుతుందని ఊరిపోతున్నాం, ఊగిపోతున్నాం.

ఇప్పుడేమో మా మానాన మమ్మల్ని బతకమని మా కర్మకు మమ్మల్నొదిలేసి అమెరికా విమానం ఎక్కేస్తాట్ట! తన స్వార్థం తను చూసుకుంటాట్ట!

ఎంత దారుణం!

చేతి ఆధారం చేజారినట్టు, చేయూతనిస్తాడనుకున్న కొడుకు చెయ్యి వదిలేసినట్టు బాధ!

ఉక్రోషం, ఉద్వేగం, దు:ఖం- ముప్పేటగా చుట్టుముట్టేశాయి.

నాకే ఇలా వుంది. ఇక నా భార్య ఎంతగా తల్లడిల్లిపోతోందో ఊహించగలను. రిటైరయ్యాక హాయిగా కృష్ణా రామా అనుకుంటూ మనవళ్ళతో కాలక్షేపం చేయాల్సిన దశలో ఇలాటివి తట్టుకోవడం చాలా కష్టం!

ఇంట్లో కూర్చోలేక సాంత్వనగా ఉంటుందని అడుగులో అడుగు వేసుకుంటూ పార్కుకెళ్ళాను.

బయటి ప్రశాంతత మనస్సులో ప్రవేశించలేకపోయింది.

లేచి వచ్చేశాను. రోడ్డుమీద ఉప్పల్ బస్సాగి వుంది.

ఉప్పల్‌లో వుండే శిరోమణిగారు గుర్తొచ్చారు. ఆయన చాలా పెద్దాయన. బాబాయి వరసవుతాడు. గెజిటెడ్ ఆఫీసరుగా చేసి రిటైరయ్యాడు. ఆయన కొడుకులిద్దరూ అమెరికాలోనే ఉన్నారు.

ఆయన్ని కలిసి ఆయనచేత మావాడికి చెప్పిస్తే ప్రయోజనం ఉంటుందనిపించింది.

ఆయన మాటని ఆనంద్ తోసిరాజన్లేడు!

మరేమీ ఆలోచించకుండా రెండంగల్లోవెళ్ళి బస్సెక్కేశాను. తిన్నగా శిరోమణిగారింటికెళ్ళాను.

ఇంటిముందున్న గార్డెన్లో మొక్కల పనిచేస్తూ కన్పించారు.

ఆయన దబ్బపండు రంగులో ఆరడుగుల ఎత్తున్న మనిషి, డెబ్బై అయిదు వసంతాలు నిండివుంటాయి. అయినా ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉన్నారు.

"ఏవోయ్ గోపాలం...... ఎలా వున్నావ్....."

"బాగానే వున్నాను బాబాయ్"

"నీ మొహం అలా కన్పించట్లేదే" మందహాసం చేశారు. ముఖం మనస్సుకి అద్దం అంటారిందుకే కాబోలు!

"ఇంట్లో చిన్న ప్రోబ్లం వచ్చింది....."

"ఆటుపోట్లు లేకుండా ఎలా వుంటాయోయ్. సముద్రానికి అలలూ, జీవితాలకి సమస్యలూ తప్పవు. అవి చీల్చుకుంటూ ముందుకు సాగిపోవాలంతే"

ఇలాంటి సలహాలు ఒకటీ రెండూ కాదు సవాలక్ష ఇస్తాను ఇతరులకి. మన దగ్గరికొచ్చేసరికి బయటపడుతుంది అసలు బండారం!

"నన్నేదో తిట్టుకుంటున్నట్టున్నావు....." చేతులు కడుక్కొస్తూ అన్నారాయన.

ఈయనకి మనస్సుల్ని చదివే విద్య తెలుసేమో అనుకుంటూ "అబ్బెబ్బే" అనేశాను.

లోపలికెళ్ళాం. ఐదారుగురు ఆడవాళ్ళకు ఎంబ్రాయిడరీ చెయ్యడం నేర్పుతోంది శిరోమణిగారి భార్య.

"బావున్నారా పిన్నీ...." పలకరించాను.

"నువ్వా గోపాలం.... చాన్నాళ్ళయ్యింది చూసి. ఒక్కడివే వచ్చావేం, కోడల్ని తీసుకురావాల్సింది....."

"రమ్మన్నాను. పనుందంది......"

"ఆడవాళ్ళకి ఇంట్లో పని లేకుండా ఎప్పుడుంటుందీ! ఇదీ పనే అని చెప్పి తీసుకురావాల్సింది!"

జవాబు దాటవేశాను.

హాల్లోకెళ్ళి కూర్చున్నాం. "ఖాళీగా వుండకుండా పిన్ని ఎప్పుడూ ఏదో పని చేస్తూంటుంది...." అన్నాను.

"వానప్రస్థాశ్రమం గురించి వినేవుంటావు. మనిషి ఒక దశకొచ్చేక వృత్తి వ్యాపారాలనుంచేగాక కుటుంబ సంబంధిత బాధ్యతల్నుంచి సైతం బయటపడాలి. శేషజీవితాన్ని అసహాయులకు సాయంచేస్తూ, ప్రశాంత జీవనం సాగించాలి. మానవ సేవే మాధవసేవ కదా. నిస్వార్థ సేవలో భగవంతుణ్ణి దర్శించాలి. ధనలాలస, స్వార్థ ప్రయో-జనాలు వదిలేస్తే జీవితం హాయిగా, ఆనందంగా ఉంటుంది.

"మీరు ట్యూషన్లూ గట్రా చెబుతున్నారేవిటి" క్లాసు పీకేసరికి అడిగాను.

నాకు తెలీకుండానే కించిత్తు వ్యంగ్యం చోటు చేసుకుంది.

"పాఠాలు చెబుతాను, చెస్ నేర్పుతాను, కథలూ, అనుభవాలూ చెబుతాను. చదువుకోమని, శుభ్రత పాటించమని, ఆరోగ్యంగా ఉండమని బోధిస్తూంటాను. కాలనీ వాసులకీ, వారి పిల్లలకీ చేదోడు వాదోడుగానూ ఉంటాం. ఎలాగైతేనేం ఇద్దరం కూడా జీవితాల్ని ఆనందంగా, బిజీగా మలచుకున్నాం. నో వర్రీస్ నో రిగ్రేట్స్ నో టెన్షన్స్. అంతా హ్యాపీయే!"

లిప్తకాలం అసూయగా చూశాను.

"మీకేం బాగా సెటిలయ్యారు. పిల్లలు రెండు చేతులా సంపాదిస్తున్నారాయె!"

"వారి సంపాదన వారిదేనయ్యా గోపాలం. మాకు, మా పెన్షనూ, సేవింగ్స్‌మీద వచ్చే వడ్డీ చాలు. మీవాడెలా వున్నాడు? బుద్ధిమంతుళ్ళే!"

"కోడలొచ్చేక కొంచెం మారాడు బాబాయ్"

అదేదో జోక్ అయినట్టు పెద్దగా నవ్వేశారు.

చిన్నబుచ్చుకున్నాను.

"పెళ్ళంటే ఎన్నో కొత్త బాధ్యతల్ని తలకెత్తుకోవడమే కదా. ఎలాటివారయినా మారాల్సిందే. బాధ్యతగా వ్యవహరించాల్సిందే!"

"కాదనడం లేదు. ఇక్కడ అర్థలకారం వరకూ సంపాదిస్తున్నాడు. అయినా

తృప్తిపడక, అమెరికా ఎగిరెళ్తానని పట్టుబడుతున్నాడు!" అన్నాను.

"వెళ్ళనీయ్!"

ఎంతో తేలిగ్గా, సులువుగా అనేశారు.

మింగుడుపడక మిత్రి చూశాను.

"ఎక్కడో నర్సాపురం పక్కనున్న పల్లెటూరిని వదలి మనం హైదరాబాదు రాలేదూ? అలాగే వాడూనూ! హైదరాబాద్ వదలి అమెరికా వెళ్తానంటున్నాడు. నాకు రెంటికీ తేడా ఏమీ కన్పించట్లేదు !"

"దానికీ దీనికీ సాపత్యమేమిటి బాబాయ్. మనం ఉద్యోగార్థం పొట్ట చేతబట్టుకునొచ్చాం. వాళ్ళేమో రెక్కలొచ్చాయని ఎగిరిపోతున్నారు!"

"పొరబడుతున్నావు గోపాలం. రెక్కలొచ్చాయని సరదాగానో, బాధ్యత మరిచో ఎగిరెళ్ళటంలేదు. సంపాదన కోసం, చక్కని భవిష్యత్తుకోసం వెళ్తున్నారు!"

"ఇక్కడా సంపాదిస్తున్నారుగా!"

"ఇదే శ్రమతో ఇంకా ఎక్కువ సంపాదించొచ్చని వాళ్ళ ఆలోచన. మనకిలాగా వాళ్ళవి ప్రభుత్వోద్యోగాలు కాదు. ఒకసారి ఉద్యోగంలో చేరితే అందులోనే రిటైర్మెంట్ అవడం అన్న పరిస్థితీ లేదు. ఉద్యోగ భద్రత అనేది అస్సల్లేదు. భవిష్యత్ భరోసా ఏమాత్రం లేదు. పెన్షన్ సౌకర్యమూ లేదు. అవునా కాదా?"

అప్రసన్నంగా చూస్తూనే తలాడించాను.

"ప్రైమ్ ఏజ్‌లో అధికంగా సంపాదిస్తే పిల్లలకు చక్కని భవిష్యత్తు ఇవ్వొచ్చని, ఓల్డేజ్ హ్యాపీగా గడుస్తుందని వారి ప్లానింగ్. దాన్ని మనం తప్పుబట్టడం సరికాదు"

"నేను కూడా అదే అంటున్నాను. చేదుగా ఉన్నా నిజం ఎప్పుడూ నిజమే. ఈ తరం కుర్రకారుకి డబ్బే ప్రాణమైపోయింది. తమ స్వార్థమే ముఖ్యమైపోయింది. తల్లీ తండ్రీ, బంధువులూ, స్నేహితులూ ఎవరూ అక్కర్లేదు. వారి దృష్టిలో బంధాలు, బంధుత్వాలు, ఏమోషన్లు, సెంటిమెంట్లు ఉత్తపదాలు! పనికిరాని మాటలు!"

కడుపులోని ఉక్రోషం కక్కేశాను.

నా వంక తేరపారి చూసి నవ్వేరు.

"పల్లెలోవున్న మీ అమ్మానాన్నల్నీ, బంధువుల్నీ వదిలేసి సిటీకొచ్చావు చూడు అప్పుడూ నువ్విలాగే ఆలోచించావా గోపాలం ?" ప్రశ్నించారాయన.

"నక్కకీ నాగలోకానికీ ముడిపెడతారేవిటి. దానికీ దీనికీ అసలు పోలికే లేదు. నాన్న రైతు. ఆ నేలనీ ఆ ఊరునీ వదలి రానన్నాడు"

"అందుకని నువ్వు వాళ్ళని వదిలేసి వచ్చానంటావు?"

ఆయన తర్కం నచ్చలేదు. అసహనంగా చూస్తూ అన్నాను.

"ముసలి తల్లిదండ్రుల్ని ఆదరించడం, అభిమానంగా చూసుకోవడం కన్నబిడ్డల బాధ్యత కాదా?"

"భలేవాడివోయ్ గోపాలం. పిల్లలు పెద్దవాళ్ళైతే వాళ్ళ పేరెంట్స్ ముసలి వాళ్ళుగాక పడుచువాళ్ళవుతారా ఏమిటి ? మరో దేశం వెళ్ళినంత మాత్రాన బంధుత్వాలు మర్చిపోతారనుకోవడం, తల్లిదండ్రుల్ని నిర్లక్ష్యం చేస్తారనుకోవడం కేవలం భ్రమ మాత్రమే!"

"మీ అబ్బాయిలు మిమ్మల్ని పట్టించుకుంటున్నారా? ఏడాదికోసారైనా వచ్చి చూసిపోతున్నారా చెప్పండి" కాస్త దూకుడుగానే అడిగాను.

"వాళ్ళు రావట్లేదు. కాని మమ్మల్ని పిలిపించుకుంటున్నారు. ప్రతీ ఏడాదీ మూడు నెలలో, నాలుగు నెలలో వాళ్ళదగ్గర ఉండి వస్తున్నాం. అన్నట్టు గోపాలం! నువ్వెప్పుడైనా మీ అమ్మానాన్నల్ని ఓ నెలరోజులపాటు నీ ఇంట్లో వుంచుకున్నావా చెప్పు? మీ అమ్మ చనిపోయినప్పుడు తలకొరివి పెట్టాల్సిన నువ్వు రాకపోతే మీ అన్నయ్య పెట్టాడు కదూ?"

గుటకలు మింగాను. ఈ ముసలాయనకి ఆ పాత సంగతులన్నీ గుర్తున్నాయి. నిజంగా దేవాంతకుడే!

"మాట్లాడవేంటోయ్ గోపాలం....."

"అప్పుడు ఇన్స్పెక్షన్ జరుగుతోంది. అందుకని వెళ్ళాలని ఎంత ప్రయత్నించినా వెళ్ళలేకపోయాను. ఐనా అన్నయ్య ఉన్నాడు కదా!"

"ఉన్నాడు. తల్లికి చిన్నకొడుకు తలకొరివి పెట్టడం సంప్రదాయం కదా!"

"ఉద్యోగ బాధ్యతలలాటివి. మీకు తెలియందేముందీ!"

నిజంగానే ఇన్స్పెక్షన్ జరుగుతున్నప్పుడే మా అమ్మ చనిపోయినట్టు కబురొచ్చింది. అప్పటికే ఇన్స్పెక్షన్‌లో చాలా లొసుగులు బయటపడ్డాయి. ప్రతి దానికీ దీర్ఘాలు తీస్తూ సతాయిస్తున్నారు. అమ్మే ముఖ్యమని వెళ్ళివుంటే, అవన్నీ రిపోర్టులోకెక్కేవి. మూడోనాటికి సస్పెన్షన్ ఆర్డర్ చేతికి వచ్చేది. అందుకని, వాళ్ళని మంచి చేసుకోడానికి, మేనేజ్ చెయ్యడానికి, సంతోషంగా సాగనంపడానికి ఉండిపోక తప్పిందికాదు. ఇవన్నీ మూడో

మనిషితో పంచుకునే విషయాలా!

"మొన్నీ మధ్యే నా ఫ్రెండ్ నాగరాజుగారి భార్య మేడమీంచి తొంగిచూస్తోంటే కళ్ళు తిరిగి కాబోలు కిందపడి చనిపోయింది. వాళ్ళబ్బాయి అమెరికాలో ఉన్నాడు. విషయం తెలీగానే ఏమన్నాడో తెలుసా? శవాన్ని ఏసీ బాక్సులో పెట్టి ఉంచమన్నాడు. దొరికిన తొలి ఫ్లైట్‌లో వచ్చేస్తానన్నాడు. అతడు చెప్పినట్టే చేశారు. మూడోరోజున అమెరికా నుంచి వచ్చాడు. హిందూ సాంప్రదాయం ప్రకారం తలకొరివిపెట్టి అంతిమ సంస్కారంచేశాడు"

నన్ను ఎత్తిపొడుస్తున్నట్టుగా అన్పించింది. ఆయన కొడుకులు అమెరికాలో ఉన్నారు గనుక నన్ను సమర్థిస్తాడనీ, మా అబ్బాయికి నచ్చచెబుతాడనీ వచ్చాను. కాని ఆయనేమో తలతిక్కగా మాట్లాడుతున్నాడు!

"ఇది వరకు మన ఊరినుంచి హైదరాబాద్ రావడానికి ఎంత టైము పట్టేదో, ఇప్పుడిక్కడ్నుంచి అమెరికా వెళ్ళడానికి అంతే టైము పడుతోంది. గ్లోబల్ విలేజ్. ప్రపంచం ఒక కుగ్రామం అయిపోయింది. ఈ దేశం ఆ దేశం అని లేదు. ఎక్కడెక్కడ పనికి తగ్గ ఫలం లభిస్తుందో, ప్రతిభకు గుర్తింపు వుంటుందో అక్కడక్కడికి వెళ్ళక తప్పదు, పోటీ పెరిగింది. అవకాశాల్ని వెతుక్కుంటూ వెళ్తున్నవారినీ, వారి స్పిరిట్‌నీ, పట్టుదలనీ మనం మెచ్చుకోవాలి తప్ప, నిరుత్సాహపరచకూడదు. తెల్సిందా గోపాలం?"

'తెలీడమే కాదు, తల బొప్పికట్టిందయ్యా బాబూ!' మనసులో అనుకుంటూ లేచాను.

"మీ బాబాయి మాటలు రుచిగాలేవు కదూ. ఆయనెప్పుడూ అంతే. ఉన్నదున్నట్టు ముఖంమీద అనేస్తారు. అయితే మీ వాడు అమెరికా వెళ్తున్నాడన్నమాట" ఆపిల్ జ్యూసూ, బిస్కెట్లూ గల ప్లేటు అందిస్తూ అంది పిన్ని.

నిలువుగా తలాడించాను.

"నాకు తెలీకడుగుతున్నాను. రోజూ దేవుడ్నేం కోరుకుంటావు గోపాలం. నువ్వూ, నీ భార్యా నూరేళ్ళు బతకాలనా లేక నీ కొడుకు సుఖసంతోషాల్తో తులతూగాలనా?"

"నేనేవిటి, ఏ తండ్రైనా పిల్లల బాగు, పిల్లల క్షేమం, పిల్లల అభివృద్ధే కోరుకుంటాడు" గుండెలు పొంగించి మరీ చెప్పేను.

"మరయితే నిన్నొదిలి వెళ్తే మీ అబ్బాయి వృద్ధిలోకి రాడంటావు.........!"

"అహహ- అలా అని కాదు"

"మరింకేవిటి గోపాలం. వెళ్ళనియ్యి. తన సత్తాని నిరూపించుకోనీ. ప్రపంచ మేథావుల్తో పోటీపడనీ. నైపుణ్యానికి మెరుగు పెట్టుకోనీ. కొత్త విషయాలు నేర్చుకోనీ, విజ్ఞానాన్ని పెంచుకోనీ. ఛాలెంజీగా బతకనీ. ఇతర దేశాల్లో ముఖ్యంగా అమెరికాలో పనిచేసి వచ్చినవాళ్ళకిక్కడ రెడ్ కార్పెట్ పరుస్తారు. ఎన్నో అద్భుత అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి. ఉన్నతస్థాయికి చేరుకోడానికెంతో దోహదమవుతుంది. అదే కదా నువ్వు కోరుకుంటోందీనూ!" అవాక్కయ్యాను.

ఆవిడేం చదువుకోలేదు.

బహుశా లోకాన్ని కాచివడపోసిందేమో. ఎంత చక్కగా విడమర్చి వివరించింద్వేలు కాదనడానికి మనస్సెలా ఒప్పుకుంటుందీ! కే!"

బిడ్డలమీద మనకీ, మనమీద బిడ్డలకీ ప్రేమాభిమానాలు ఉండాల్సిందే. కానీ మన ప్రేమ బిడ్డల కాళ్ళకు బంధం కాకూడదు. వాళ్ళని ఎదగనిద్దాం. ఎగరనిద్దాం. ఎంత ఎత్తులకెదిగినా, ఎంత దూరం ఎగిరెళ్ళినా, ఢిల్లీకి రాజే అయినా సరే వారు మన బిడ్డలే. తిరిగి తిరిగి మనింటికే వస్తారు తప్ప మనకి దూరం కారు. మనల్ని మాతృదేవోభవ, పితృదేవోభవ అని పూజించక మానరు. అది నీ గొప్పో నా గొప్పో కాదు. వారి రక్తంలో ప్రవహిస్తోన్న మన సంస్కృతి గొప్పదనం!"

ఊపిరి పీల్చుకోడానికాబోలు ఆగి మరలా సాగింది వాక్ప్రవాహం. "మనం మన తల్లిదండ్రుల్లా ఆర్థికంగా దిగజారి లేం. ఒక స్థాయిలో వున్నాం. పెన్షన్ ఉంది. ఆస్తులూ ఉన్నాయి. అంచేత పిల్లలు మనల్ని చూడటం లేదంటూ గోలపెట్టడం మానేద్దాం. వారు తిరిగొచ్చేదాకా అభాగ్యుల, అనాథల పిల్లల్లో మన పిల్లల్నీ, మనవల్నీ చూసుకుందాం. వారికి మన ప్రేమ పంచిద్దాం. పది పువ్వులు వికసించడానికి మన ఈ ఆఖరి దశలో మనవంతు కృషిచేద్దాం. మన జన్మ సార్థకం చేసుకుందాం......"

పిన్నిలో గీతాబోధన చేసిన కృష్ణుడు కనిపించాడు.

మనస్సులోని భయాలు, దిగుళ్ళు, ఉక్రోషాలు, ఆవేదనలు, వాటితోపాటు స్వార్థాలూ భస్మమైపోయాయి.

నేను శక్తిమంతుణ్ని, చాలామందికన్నా అదృష్టవంతుణ్ని. నేను దిగాలుపడి కూర్చోవాల్సిన పనిలేదు.

ఎంతో మందికి, ఎన్నోరకాల సేవ చెయ్యగలను, ప్రేమించగలను, ఆనందాన్ని

పండగలను.

గీతలో అన్నట్టు కర్మణ్యేవాధికారస్తే. కర్తవ్య కర్మము ఆచరించడంలోనే నాకు అధికారముంది. ఫలం మీద లేదు. ఇన్నాళ్ళూ కుటుంబంకోసం చేశాను. ఇక సమాజం కోసం నావంతు కర్మ నిర్వహిస్తాను.

నా బిడ్డ నిర్వర్తించాల్సిన కర్మ అతడే నిర్వర్తిస్తాడు. ధ్దానిగురించి నేను దిగులుపడటం అనవసరం!

మనస్సు దూదిపింజ అయింది. ఒంట్లోని అణువణువులోనూ నూతనోత్తేజం వెల్లువెత్తింది.

కర్తవ్యోన్ముఖుడయిన అర్జునుడినై ఆమెకి చేతులు జోడించి నమస్కరించాను.

(స్వాతి సవరివారపత్రిక 30.12.2011)